ప్రజాశక్తి






సోమవారం 27 అక్టోబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

దూసుకొస్తున్న మొంథా

- తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తం
- జిల్లా, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు
- మచిలీపట్నం, హంసలదీవి బీచ్‌లు మూసివేత
- పాఠశాలలకు మూడు రోజులు సెలవు



తుపాను ప్రభావాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను దూసుకొస్తోంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాపై దీని ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలు చేపట్టింది. అమ్రపాలిని ప్రత్యేక అధికారిగా నియమించింది. తుపాను సమాచారం, సహాయక చర్యల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లలో నాలుగు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మచిలీపట్నం మండలం మంగినపూడి, కోడూరు మండలం హంసలదీవిల్లో బీచ్‌లను మూసివేశారు. సముద్రంలో అలలు తాకిడి పెరగడంతో యాత్రీకులు కార్తీకమాసం సముద్ర స్నానాలకు వెళ్లకుండా నిలిపివేశారు. సోమ, మంగళ, బుధవారాలు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. సముద్రతీరంలోని మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండలాల్లో పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయడానికి అధికారులు పలు ప్రాంతాల్లో పాఠశాలలను పరిశీలించారు.

... వార్తలు 2, 7వ పేజీల్లో

వసతుల మెరుగుదలకు చర్యలు

- ప్రత్యేకాధికారులతో హాస్టళ్ల పర్యవేక్షణ
- ఎన్‌టిఆర్ జిల్లా డిటిడబ్ల్యుఒ ఎం.ఫణిధూర్జటి





ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల వసతుల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి (డిటిడబ్ల్యుఒ) ముదిగొండ ఫణిధూర్జటి చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పది గిరిజన విద్యాలయ సంస్థలు వాటికి అనుబంధంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిల్లో 1910 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, వాటి తీరుపై ఆయన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: విద్యార్థులు ఎంత మంది ఉన్నారు?

జవాబు: విజయవాడ మాంటిస్సోరి కళాశాల (పోస్టుమెట్రిక్) 32 మంది బాలికలు, విసన్నపేట బాలుర హాస్టల్ 36 మంది, మండల కేంద్రమైన ఏ. కొండూరు ఆశ్రమం పాఠశాల హాస్టల్ 280 మంది విద్యార్థులు (3వ తరగతి నుంచి 10వ తరగతి) ఈ మూడు విద్యాసంస్థలకు సంబంధించిన వసతి గృహాలను నేరుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. మరో ఏడు గురుకుల (మిగతా 2లో)

గురుకులమా... మురికికూపమా?

- అద్దె భవనంలో వసతులు మృగ్యం
- వసతి గృహాల పక్కనే రోజుల తరబడి వర్షపు నీరు
- యథేచ్ఛగా పశువుల సంచారం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన ఉండటం లేదు. జిల్లాలో మచిలీపట్నంలో ఉన్న ఏకైక మైనార్టీ గురుకుల పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. రోజుల తరబడి నిలిచి ఉన్న వర్షపు నీరు, యథేచ్ఛగా సంచరించే పశువులు, వాటి విసర్జితాలతో మచిలీపట్నంలో అద్దె భవనంలో నిర్వహించబడుతున్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం మురికికూపంలా దర్శనమిస్తోంది. దీనికి తోడు ఈ ఏడాది ఇప్పటి వరకు విద్యార్థులకు ట్రంక్ పెట్టేలు, దుప్పట్లను అందించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

మచిలీపట్నం చిలకలపూడి రైల్వే గేటు సమీపంలోని ఓ ప్రయివేటు సంస్థకు చెందిన ప్రాంగణంలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. 5 నుంచి 10 తరగతి విద్యార్థులు 170 మంది దీనిలో విద్యనభ్యసిస్తున్నారు. 35 మంది మైనార్టీయేతర విద్యార్థులున్నారు. తరగతి గదులు, కార్యాలయాల నిర్వహణకు అనుగుణంగా మాత్రమే భవన నిర్మాణం ఉంది. ఈ భవనంలోని గదులనే విద్యార్థుల వసతికి కేటాయించారు. వసతి ఉండే గదుల నుంచి ప్రాంగణంలోని బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు వినియోగానికి పర్లాంగు దూరంపైగా వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లోనూ, భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో విద్యార్థులు బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు వినియోగించ ఎకోవడంలో సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు దుప్పట్లు, ట్రంక్ పెట్టేలను ప్రభుత్వం అందించాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలైనా ఇప్పటి వరకు విద్యార్థులకు ట్రంక్ పెట్టేలు, దుప్పట్లు సరఫరా చేయలేదు. అధిక వర్షాలకు చలి వేసిన రోజుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వాటిల్లోనే మునగదీసుకు పడుకోవాల్సి వస్తోంది. ట్రంక్ పెట్టేలు లేకపోవడంతో వసతికి కేటాయించిన రూమ్‌ల్లోనే అవసరమైన (మిగతా 2లో)



గురుకుల పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

పశువుల పేడతో అపరిశుభ్రం

కట్టలేరు కష్టాలు..!



- వినగడప వద్ద వంతెన కూలి ఏడేళ్లు
- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి వైసిపి హామీ
- ప్రభుత్వాలు మారుతున్నా పట్టని నేతలు
- తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-గంపలగూడెం: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వంతెన నిర్మాణం జరగకపోవడంతో 30 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్ర, తెలంగాణ మధ్య వారధిగా మారాల్సిన ఈ వంతెన లేకపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. అటు ఖమ్మం జిల్లాలో 10 నుంచి 15 గ్రామాలు... ఇటు ఎన్టీఆర్ జిల్లాలో 15 గ్రామాలు.. ఇటు జనం అటు వెళ్లాలన్నా, అటు జనం ఇటు రావాలన్నా కట్టలేరు కష్టాలను దాటాల్సిందే. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి వంతెన నిర్మాణం ప్రతిపాదన కలగానే మిగిలిపోతుండటంతో రెండు జిల్లాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

ఖమ్మం జిల్లాలోని లంకాసాగర్‌లో పుట్టిన కట్టలేరు వాగు అనేక మలుపులు, వంపులతో సరిహద్దులను చెరిపేసుకుని కృష్ణమ్మ ఒడిలోకి చేరుతుంది. లంకాసాగర్ నుంచి కిలోమీటరుకు పైగా ప్రవహించి (మిగతా 2లో)

నేడు ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-తిరువూరు: కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న తోటమూల నుండి చలో తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ, అనంతరం జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హాస్టల్ ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని అల్లూరు, జుజ్జూరు, వీరులపాడు గ్రామాల్లో ఉన్న హాస్టళ్లల్లో ఉన్న సమస్యలపై ఈ నెల 25 ప్రజాశక్తి దినపత్రిలో ప్రచురితమైన 'హాస్టళ్లు సమస్యలకు నిలయాలు' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జుజ్జూరు బిసి హాస్టల్‌ను పున:ప్రారంభించాలని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి లక్ష్మీదేవి ఆదేశాలు జారీ చేశారు. వీరులపాడు ఎస్సీ హాస్టల్లో నెలకొని ఉన్న మరుగుదొడ్ల సమస్యపై వార్డెన్ సయ్యదర్ అహ్మద్ కీరాని స్పందించి పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే జుజ్జూరు బిసి హాస్టల్ వార్డెన్ రామరాజు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి హాస్టల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న వార్డెన్

మొదటిపేజీ తరువాయి

వసతుల మెరుగుదలకు చర్యలు

పాఠశాలలను సొసైటీ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: మెనూ రూపంలో ప్రతి విద్యార్థికి ఎంత కేటాయిస్తున్నారు?

జవాబు: 2023 ప్రకారం 3వ తరగతి నుంచి 4వ తరగతి వరకు రూ.1150, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.1400, ప్రభుత్వ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు రూ.1600 మంజూరు చేస్తున్నారు. థర్డ్ క్వార్టర్‌కు కూడా డైట్ చార్జీల చెల్లింపులు జరిగాయి. కాస్మోటిక్స్ ఖర్చుల కింద బాలురకు మూడవ తరగతి నుంచి 6వ తరగతి రూ.175, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.200, బాలికలకు రూ.130, రూ.200, ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు రూ.250, ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు రూ.250 మంజూరు చేస్తున్నారు.

ప్రశ్న: సొంత భవనాలు ఎన్ని హాస్టల్స్‌కు ఉన్నాయి...?

జవాబు: జిల్లాలో తొమ్మిది పాఠశాలల హాస్టల్స్‌కు సొంత భవనాలుండగా, మండల కేంద్రమైన విసన్నపేట జూనియర్ కళాశాల బిల్డింగ్‌లోనే హాస్టల్‌ను నిర్వహించడం జరుగుతుంది.

ప్రశ్న: టీచర్ పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయి?

జవాబు: ఆశ్రమ పాఠశాలలకు ఇటీవల నిర్వహించిన డిఎస్సీ ద్వారా ఐదుగురు ఉపాధ్యాయులు భర్తీ కాగా, తెలుగు, హిందీ, పిఇటి, సోషల్‌సైన్స్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఈ పోస్టులను కాంట్రాక్ట్ బేస్‌పై టీచర్లు పని చేస్తున్నారు. బాలికల హాస్టల్స్‌లో ప్రత్యేకించి లేడీస్ స్టాఫ్ మాత్రమే పని చేస్తున్నారు.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణ తీరు ఎలా ఉంటుంది.?

జవాబు: సహజంగానే శానిటేషన్ నిర్వహణకు అవసరమైన బడ్జెట్ తక్కువ. ప్రత్యేకించి విజయవాడ, విసన్నపేట హాస్టల్స్‌కు శానిటేషన్ వర్కర్లు లేరు.

ప్రశ్న: హాస్టళ్ల పర్యవేక్షణ ఎలా ఉంది?

జవాబు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, బిసి,ఎస్‌సి, మైనార్టీ, డిజైబుల్డ్ తదితర 90 హాస్టల్స్‌కు ఒక్కొక్క దానికి ఒక్కొక్క జిల్లా స్థాయి అధికారిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: అధికారులు గుర్తిస్తున్న సమస్యలు ఏమిటి?


జవాబు: ప్రధానంగా మంచినీరు, శానిటేషన్ నిర్వహణ మెరుగుదలకు చర్యలు తీసుకోవడంతో పాటు విసన్నపేట కళాశాల బాయ్స్ హాస్టల్‌కు బెడ్స్‌తో పాటు లైటింగ్, మెరక తోలించాలని గుర్తించారు.

ప్రశ్న: వైద్య పరీక్షల్లో వెలుగు చూస్తున్న అనారోగ్య సమస్యలేవి?

జవాబు: సహజంగా గిరిజనుల్లో రక్తహీనత ఎక్కువుగా ఉంటుందని పలు పరీక్షల్లో వెల్లడవుతుంది. అడపాదడపా సీజనల్‌గా జ్వరాలతో పాటు ముఖ్యంగా సికెల్‌సెల్ ఎనీమియా జబ్బు (ఆక్సిజన్ తగ్గుదల) ఉంటుందని గుర్తించారు.

దూసుకొస్తున్న మొంథా

• భయాందోళనలో ప్రజలు • చేతికొచ్చే దశలో వరి, వాణిజ్య పంటలు



ప్రజాశక్తి-విజయవాడ: తరుముకొస్తున్న మొంథా తుఫాను పట్ల ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. అయితే తుఫాను నుంచి ప్రజలకు ఎటువంటి విపత్కర పరిస్తితులు ఎదురు కాకుండా కాపాడేందుకు అన్ని రకాల జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్‌టిఆర్‌జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవడంతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలన్నింటికీ సెలవులు ప్రకటించారు. తుఫాను తీవ్రతపై గత రెండు మూడు రోజుల నుంచి అటు ఎలక్ట్రానిక్, ఇటు ప్రింట్‌మీడియాలో విఫరీతమైన ప్రచారం జరుగుతుండటం, గతంలో సంభవించిన తుఫానులు, ప్రజలు పడిన అవస్థలు, ఎదుర్కొన్న కష్ట-నష్టాలు...ముఖ్యంగా ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటలు చేతికొచ్చే దశలో ప్రమాదకర స్థాయిలో తరుముకొస్తున్న తుఫానుకు రైతులు భీతిల్లిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షా 20 వేల ఎకరాల్లోని వరి పంట చేతికొచ్చే దశలో మొంథా తుఫాను తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోననే భయాందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాణిజ్యపంటలు ముఖ్యంగా పత్తి, పసుపు, మొక్కజొన్న పంటలతో పాటు హార్టికల్చర్ పంటలు అరటి, బొప్పాయి ఇతర పంటలు పూర్తిగా దెబ్బతింటాయోమోననే ఆలోచన, పంటలు దెబ్బతిని, జరగబోయే నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఏ మేరకు ఆదుకుంటారో...అన్ని విధాలుగా అందుబాటులో ఉంటారోననే సందేహాన్ని వ్యక్తం చేస్తూ భయాందోళనతో రైతులకు కంటిమీద కొనుకు లేకుండా గడపాల్సి వస్తోందని వారు వ్యక్తం చేస్తున్నారు. అలాగే జరగరాన్ని ప్రమాదాల్లో చిక్కుకొని పశువులు, గొర్రెలు, కోళ్లు, ఇతర రకాల జంతువుల పరిస్థితి ఎలా ఉంటుందోనని సంబంధిత రైతులు, వాటి యజమానులు తీవ్ర భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.భారీ వర్షాలకు కృష్ణానది, జిల్లా పరిధిలోని దాని ఉపనదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లి, చప్టాలపైగా భారీ ఎత్తున పారుతూ, రాకపోకలు స్తంభించినా...అనుకోని విపత్కర పరిస్తితుల్లో జరగరాని ప్రమాదాలు సంభవించకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమేరకు ఉపయోగపడతాయో, అందుబాటులో ఉంటాయో సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణాల సందర్భంలో పలు రూపాల్లో ముంచుకొచ్చే ప్రమాదాల నివారణకు ఎంత వరకు నివారించి, ప్రజలను కాపాడగలుగుతారో గత అనుభవాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా విజయవాడ నగర పరిధిలో అనేక అనుభవాలు ఉన్నాయి. చినుకుపడితేనే నగరం మొత్తం చిత్తడి చిత్తడిగా ఉండటమే గాక, ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిస్తే వీధులు, రహదారులన్నీ చెరువులను తలపించే రీతిలో జనజీవనం స్తంభించే పరిస్థితి సర్వసాధారణం. అంతేగాక గత మూడు, నాలుగు రోజుల నుంచి అడపాదడపగా కురుస్తున్న వర్షాలతో పాటు మొంథా తుఫానుకు రోజుల తరబడి అతి భారీ వర్షాలు కొండ చర్యలు ఇరిగిపడే ప్రమాదం లేకపోలేదని గత అనుభవాలు విధితం చేస్తున్నాయి. కొద్ది పాటి వర్షాలకే నగర పరిధిలోని 16 డివిజన్ల పరిధిలో సుమారు 50 వేల గృహాల్లో పెద్ద సంఖ్యలోనే నివాసాలుంటున్నాయి. పెనుతుఫానుకు బలమైన వీధురుగాలులతో కూడిన వర్షానికి బలహీనంగా ఉన్న కొండ చర్యలు ఇరిగి పడే ప్రాంతాలను ఎన్ని చోట్ల గుర్తించారు, వాటి నివారణకు, ప్రజలను ఎంత మేర అప్రమత్తం చేశారో, వారందరికీ ఏ మేరకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారో...ప్రశ్నార్ధకంగా తయారయిందని ఆయా కొండ ప్రాంతాల ప్రజలు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే అతి భారీ వర్షాలకు రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యి రాకపోకలు స్తంభించే పరిస్థితుల్లో అత్యవసరంగా వాటర్‌ను క్లియర్ చేయడానికి ఏమేరకు మోటార్ ఇంజన్లు, వర్కర్లు, పర్యవేక్షణ అధికారులను ఏర్పాటు చేశారో , ప్రతి సారి లోపిస్తున్న సమన్వయాన్ని ఎంత వరకు భర్తీ చేసుకుంటారో ప్రశ్నార్ధకంగా తయారయింది. ప్రధానంగా నగర పరిధిలో కృష్ణానది పరివాహక ప్రాంత నివాసాలు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వస్తే వాటిని బయటకు పంపించడానికి నగరపాలక సంస్థ తీసుకునే చర్యలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. తుఫాను నష్టాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకులమా... మూరికికూపమా!

పుస్తకాలు, దుస్తులు, ఇతర సామాగ్రిని సర్ధుకుంటు అవస్థలు పడుతున్నారు.

మురికికూపంలా ప్రాంగణం

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ముడ) కార్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోనే 'ఏపి రెసిడెన్షియల్ ఫర్ మైనారిటీ బాయ్స్' నిర్వహించబడుతోంది. వసతికి కేటాయించిన రూమ్‌ల వెనుక ప్రాంగణం పల్లంగా ఉండటంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోతోంది. యదేచ్ఛగా ప్రాంగణంలో పశువులు సంచరిస్తు నిల్వ నీటిలో దొర్లుతున్నాయి. విద్యార్థులు మెస్‌కు వెళ్లి వచ్చే ప్రాంతాలు పేడతో నిండిపోయి ఉంది. ప్రాంగణ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. నిల్వ ఉన్న నీరుతో ప్రాంగణంలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. విద్యార్థులు దోమల బెడదను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ కొద్ది రోజుల క్రితం ఆరుగురు విద్యార్థులకు జ్వరాలు వచ్చాయి. సీజనల్ వ్యాధుల భారిన పడుతున్న విద్యార్థులకు చికిత్స అందించేందుకు నర్సును అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు వైద్య సేలందిస్తున్నారు.

గురుకుల భవన నిర్మాణంలో నిర్లక్ష్యం

2017-18 ఆర్థిక సంవత్సరంలోనే మచిలీపట్నం రుద్రవరం వద్ద రెసిడెన్షియల్ భవనాన్ని నిర్మించడనికి స్థలం కేటాయించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎన్‌ఆర్‌ఇజిఎస్) మెటీరియల్‌కాంపౌండ్ నిధులతో స్థలానికి రెండు వైపుల ప్రహరీ గోడ నిర్మించారు. ప్రభుత్వం రూ. 15 కోట్లు నిధులు కేటాయించింది. కేటాయించిన నిధులు కాగితాల్లోనే ఉన్నాయి. కార్యరూపం దాల్చలేదు. టెండర్ పిలిచి భవనాలను నిర్మించలేదు. దీంతో మైనార్టీ రెసిడెన్షియన్ విద్యార్థులు అద్దె భవనంలో అవస్థలు పడాల్సి వస్తోంది.

స్వంత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

బి.రవి, ప్రిన్సిపల్, ఎపి రెసిడెన్షియల్ మైనార్టీ బాయ్స్, మచిలీపట్నం

విద్యార్థుల వసతికి, తరగతుల నిర్వహణకు సమస్యలు లేకుండా చూస్తున్నాం. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నాం. అనారోగ్య సమస్యలకు గురైన విద్యార్థులను ఎప్పటికప్పుడు వైద్యుల వద్దకు తీసుకెళుతున్నాం. విద్యార్థులకు ప్రత్యేకంగా నర్సు వైద్య సేవలందిస్తున్నారు. ఇటీవల ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు దాత సాయం అందించారు. విద్యార్థుల వసతికి కేటాయించిన రూమ్‌ల్లోకి దోమలు రాకుండా కిటికీలకు మెస్ కొట్టించాం. స్వంత భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

కట్టలేరు కష్టాలు..!

ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి తిరిగి ఖమ్మం జిల్లా మీదుగా ప్రవహించి నందిగామ సమీపంలో పెండ్యాల చేరుతుంది. అక్కడ మునేరులో కలుస్తుంది. ఇంతదూరం ప్రవహించే వాగుపై గంపలగూడెం మండలం వినగడప వద్ద ఖమ్మం జిల్లాను కలుపుతూ ఒక లోబ్రిడ్జి ఉండేది. జగ్గయ్యపేట, నూజివీడు, నందిగామ, విజయవాడ ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్లే వాహనాలన్నీ ఈ వంతెన పైనుంచే అక్కడికి చేరుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఇక్కడ పరిస్థితి భయానకంగా మారింది. అటు ఇటు రాకపోకలు సాగించే వారికి కట్టలేరు కష్టంగా మారింది. వర్షాకాలంలో ఈ వంతెన పైనుంచి రాకపోకలు సాగించాలంటే జనం బిక్కుబిక్కుమంటూ అడుగులు వేయాల్సి వస్తోంది.

కష్టం ఎప్పటికి తీరేను..?

కట్టలేరు వాగుపై 1977వ సంవత్సరంలో లోబ్రిడ్జిని నిర్మించారు. అప్పటి మంత్రి చనమోలు వెంకట్రావు హయాంలో ఈ నిర్మాణం చేపట్టారు. తెలంగాణలో ఉన్న ఖమ్మం జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న గ్రామాల మధ్య రాకపోకలకు ఉపయోగపడేలా ఈ లోబ్రిడ్జి నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు, ప్రజాప్రతినిధులు పెరుగుతున్న రాకపోకలను గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై దృష్టి పెట్టలేదు. 2018లో కృష్ణానదికి వచ్చిన వరద ఉధృతికి కట్టలేరు వాగుపై నిర్మించిన లోబ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. ఈ బ్రిడ్జి స్థానంలో వాగుపై పెద్ద సిమెంట్ బిల్లలు ఏర్పాటు చేశారు. దానిపై రహదారి వేశారు. కట్టలేరుకు వరద వస్తున్న ప్రతిసారీ నీరు ఈ తాత్కాలిక వంతెన పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో రెండువైపుల నుంచి రాకపోకలు ఆగిపోతున్నాయి. వరద ఉధతి తగ్గే వరకు ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి.

ఉత్తుత్తి హామీలే..

ఖమ్మం-ఎన్టీఆర్ జిల్లాను అనుసంధానం చేసే బ్రిడ్జి పొడవు 200 మీటర్లు ఉంటుంది. వైసీపీ అధికారం చేపట్టడానికి ముందు లోబ్రిడ్జి కొట్టుకుపోయింది. అధికారంలో ఉన్నన్ని రోజులు దీని నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు తిరువూరులో నిర్వహించిన సభలో అప్పటి సీఎం జగన్ వినగడప వద్ద కట్టలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీనికి రూ.26 కోట్లను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కేవలం ఉత్తుత్తి హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు. జగన్ ప్రకటన తర్వాత ఎలాంటి పురోగతి లేదు. కూటమి ప్రభుత్వమైనా హైలెవల్ బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీర్చుతుందనిని రెండు జిల్లాల ప్రజలు ఆశగా ఎదురుచూశారు. గడిచిన ఏడాదిన్నరగా అవి కలలుగానే మిగిలిపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు రాస్తారోకోలు, పాదయాత్రలు, ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. సాంకేతికంగా అన్ని అనుమతులు వచ్చాయని, బ్రిడ్జి నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి చెబుతున్నా ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడటంలేదు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన సమస్య జఠిలం

గువ్వల సీతారామిరెడ్డి, సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు

ఈ ప్రాంతంలో వంతెన సమస్య జటిలమైంది. దీనిని పరిష్కరించకపోతే ప్రజలను కూడగట్టి భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. ఏడేళ్లుగా వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.



చల్లపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



ప్రజలకు సూచనలిస్తున్న ఉయ్యూరు ఎంపిడిఓ శేషగిరిరావు

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : మొంథా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రానున్న మూడు రోజులలో అధికారుల అప్రమత్తంగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లి వచ్చిన ఆయన విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. అనంతరం చల్లపల్లి తాసిల్దార్ కార్యాలయం చేరుకొని అధికారుల తో సమావేశమ య్యారు. పంచాయతీ కార్యదర్శి తో మాట్లాడుతూ గ్రామాల్లో పూరిళ్లల్లో నివసించే ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రోడ్ల వెంబడి గుడారాల్లో నివసించే ప్రజలు, శిథిల భవనాలలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని అన్నారు. చల్లపల్లి గ్రామపంచాయతీకి వక్తా మిషన్ మంజూర అయిందని, తుఫాన్ అనంతరం చల్లపల్లి వచ్చి అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి,విద్యుత్ శాఖడిప్యూటీ సీఈఓ ఆర్వి.ఆనందకుమార్, ఏఈలు బొప్పన శ్రీనివాసరావు ధర్మేంద్రరావు చల్లపల్లి కార్యదర్శి పి.వి మాధవేంద్రరావు పాల్గొ న్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : రానున్న మూడురోజుల్లో మొంథా తుపాను జిల్లాపై విరుచుకుపడే అవకాశం ఉన్ననే పధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న సురక్షిత ప్రాంతాల కు చేరుకోవాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు గ్రామ ప్రజలకు సూచించారు. మండల పరిధి కడవకొల్లు, ముదునూరు, కాటూరు, కాకాని నగర్లో ఆదివారం పర్యటించి, తుపాను ప్రభావం ఎలా ఉండవచ్చునది ప్రజలకు వివరించి జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. పూరిపాకలు, శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు అప్రమత్తతతో ఉండా. లన్నారు.ముదునూరు మాజీసర్పంచ్ ఎం. జ్ఞానశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారులతో తహసీల్దార్ సమీక్ష

మొంథా తుపానుపై మండల పరిధిలో అధికారులతో తహసీల్దార్ సురేశ్ కుమార్ ఆదివారం సమీక్షించారు. తుపాను ప్రభావం మూడురోజులు ఉంటుందని జిల్లా ఉన్నతాధి కారుల హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవాలసిన జాగ్రత్తలు తెలియజేసి అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల** : ఘంటసాల మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఆదివారం వివిధ శాఖల ఉద్యోగులతో ఎంపీడీవో సుబ్బారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ఆరోగ్య సూచనలు చేస్తుండాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహించి తుఫాను హెచ్చరికలు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్, ఎంఈఓ మోమిన్, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు నిఖిత ప్రసాద్, వేమూరి ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో గుడివాడ రూరల్ మండల పరిధిలో ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా ఆదివారం మోటూరు గ్రామంలో తాలుకా ఎస్.ఐ చంటిబాబు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కిరణ్‌కుమార్‌తో కలసి గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబు గ్రామ ప్రజలకు తుఫాను సంబంధిత జాగ్రత్తలపై సూచనలు తెలియజేశారు. తుఫాను సమయంలో ప్రజలందరూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని, విద్యుత్ తీగలు, చెట్లు, ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండాలన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : తుపాను నేపథ్యంలో ప్రజలు అత్యవసవర వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలని కంకిపాడు ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను సందర్భంగా ప్రజలు తాగునీరు, నిత్యాసవరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయలు ఏర్పడే అవకాశం ఉన్నందున, రీచార్జీ లైట్లు సమకూర్చుకోవడం, సెల్ ఫోన్లలో పూర్తిగా చార్జింగ్ ఉంచుకోవాలన్నారు.

తీరప్రాంత రైతుల ఆందోళన

ప్రజాశక్తి-అవనిగడ్డ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తుఫానుగా మారబోతున్నట్లు వార్తలు వెలువడటంతో పాటు అది కాకినాడ మచిలీపట్నం ప్రాంతాలలో తీరం దాటవచ్చునని వార్తతో దివిసీమలోని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో కష్టాలకు వచ్చి రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా వచ్చిన వరదల వల్ల నదీ పరివాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో ఉన్న ఉద్యానవన పంటలు దెబ్బతినగా. ఈసారి తుఫాను వల్ల తీవ్ర వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పడంతో పాటు, గాలులు కూడా వేయవచ్చునని వాతావరణ శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు .దీనితో తయారైన వరి నేలకు పడిపోయే అవకాశం ఉందని అదే విధంగా పొట్ట దశలో ఉండి, శంకు పోసుకుంటున్న వరి ఎందుకు పనికి రాకుండా పోతుందని దీనితో ఎకరాకు 20 నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు చివరి దశలో తుఫాను వల్ల, వర్షాల వల్ల నష్టం జరిగితే వారికి కోలుకోలేని నష్టం జరగవచ్చని రైతులు భావిస్తున్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:** తుపాను నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండల తాసిల్దార్ కే మస్తాన్రావు అన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు కష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో తాసిల్దారు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ గ్రామ కార్యదర్శులచే కాబోయే తుఫాను గురించి గ్రామాలలో మైకులతో ప్రచారాలు చేయించారు. పూరి గుడిసెలో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. స్థానిక అధికారులతో పాటు పంచాయతీ సిబ్బంది ఆశా వర్కర్లు, అంగన్వాడి వర్కర్లు అందరూ ప్రజలకు అందుబాటులోఉండాలని సూచించారు. మొవ్వ తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9908664611 నెంబర్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలు తమ సమస్యలను తెలియపరచొచ్చని అన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల చోడవరం లంక పోలాల దగ్గర డొంక రేవు లో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కాల్వలో కొట్టుకు వచ్చి పక్కనే ఉన్న పొదలలో చిక్కుకుందని పెనమలూరు పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 35 నుండి 40 సంవత్సరాల వయసు కలిగి ఉండి, సుమారు 5.6 అడుగులు ఎత్తు కలిగి ఉండి సిమెంట్ రంగు షర్టుపై తెల్లటి చారలు గల చొక్కా, సిమెంట్ ట్రంక్ ప్యాంట్ దుస్తులు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని ఆచూకి తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలన్నారు. అనంతరం కేసు నమోదు చేశారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి జ్యోతిరావ్ పూలే బాలుర గురుకుల పాఠశాలను శనివారం రాత్రి బిసి వెల్ఫేర్ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.సత్యనారయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతవారం గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతూ ఆరేవరపు భార్గవ్ (11) మృతిచెందడంపై ఆరాతీశారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి, రికార్డు తనిఖీ చేశారు. అనంతరం వంటశాలలో భోజనం రుచిచూశారు. విద్యార్థులు వసతి సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్‌కు సూచించారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : తుపాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 27,28,29 తేదీల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటిస్తే సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులందరిని వారి ఇళ్లకు పంపించాలని ప్రభుత్వం ఆదేశిస్తే ఇంత వరకు కొన్ని విద్యాసంస్థలు సెలవులు ప్రకటించకపోవడం తగదని ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి సమరం అన్నారు. ఆదివారం బుట్టాయిపేటలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో చదువుతున్నారని, తుపాను నేథ్యంలో ప్రభుత్వం సెలవులు మంజూరు చేసినా ఇంత వరకు కొన్ని ప్రైవేటు కళాశాలలు సెలవులు ప్రకటించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం, వారి స్వలాభం కోసం ప్రభుత్వ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రవర్తిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంజనీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల తోపాటు ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలో సెలవులు మంజూరు చేయకుండా విపత్తు సమయంలో కూడా ర్యాంకులు పర్సంటేజ్ కోసం వెంపర్లాడుతున్న విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన సచివాలయ భవనం, 23. 94 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు సేవా కేంద్ర భవనాలను ఆదివారం పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లాగే 3 కోట్ల 40 లక్షల రూపాయలతో పెదపూడి నుండి మొవ్వ వరకు రోడ్డు టెండర్ అయిందని, వర్షాల అనంతరం రోడ్డు వేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ తాతా రజిని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, కూచిపూడి పి.ఏ.సిఎస్. మాజీ అధ్యక్షులు తాతా రాంబాబు, తాతా ప్రభాకర రావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం, పెదప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన కర్ర రాజు ఇటీవల ప్రమాదవశాత్తు గుండెపోటు కారణంగా మృతిచెందగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), మోపిదేవి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చోడబత్తిన పూర్ణచంద్రరావు, పెదప్రోలు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ఆది రాంబాబు, వార్డు మెంబెర్ యల్లమల్లి రాజశేఖర్,



నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కర్(బాలు) తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతులను ఆదుకోవాలి



ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు) : బాపుల పాడు మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో ఆకాల వర్షాల కారణంగా మినుములకు మొలకలొస్తున్నాయని రంగన్నగూడెం, సింగన్న గూడెం, బండారుగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, రేమల్లి గ్రామాల రైతులు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల రైతు సంఘ కార్యదర్శి తోట సాంబశివరావు మాట్లా డుతూ ఆకాల వర్షాల వల్ల మినుము పంట మొత్తం నాశనమైందని, కాయలు మొలకెత్తుతున్నాయని, ఇది రైతులకు భారీ నష్టమన్నారు. రైతుల పరిస్థితిపై అధికారులు తక్షణం దష్టి సారించాలని, పంట నష్టానికి తగిన పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని. నష్టనివారణకు ప్రభుత్వం తక్షణం చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజక వర్గ పరిధిలోని 67 మంది లబ్ధిదారులకు రూ 53 లక్షల 24 వేల 683 రూపాయి ల ముఖ్య మంత్రి సహాయనిది చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పంపిణీ చేశారు. ఆదివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాల యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం కూడా పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ప్రజాశక్తి-కంకిపాడు : కంకి పాడు మండలం, ఉప్పులూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ నుండి మంజూరైన 9 లక్షల రూపాయల నిధులతో డ్రైన్ పనులకు ఆదివారం కంకి పాడు జడ్పిటిసి సభ్యులు బాకీ కోటేశ్వరరావు(బాకీ బాబు) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు లాంపార్వతి, వైసిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రకాశం బ్యారేజీకి తగ్గిన వరద



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం స్వల్పంగా తగ్గింది . రాత్రి 7 గంటలకు ఎగువ నుంచి 54,561 క్యూసెక్కులు వచ్చింది. బ్యారేజీ వద్ద 5 గేట్లను రెండు అడుగులు, 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 52,610 క్యూసెక్కులు విడుదల చేశారు. కష్ణాతూర్పు (కేఈ) పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాల్వ, గుంటూరు ఛానల్, రైవస్, బందరు, కేఈబీ కాల్వలు కట్టివేశారు. పులిచింతల (వజినే పల్లి) నుంచి 42,378 , పాలేరు నుంచి 2,295, మునేరు (కీసర) నుంచి 9,888 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉంది. ప్రకాశం బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 11.6 అడుగులు మేర కొనసాగుతుంది.

టిడిపి నేత శీలంనేనికి పరామర్శ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శీలంనేని సాంబశివరావును మైల వరం ఎమ్మెల్యే వసంత వెంకట కష్ణప్రసాద్ ఆదివారం పరామ ర్శించారు. ఇటీవల ఆయన గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. వసంత కష్ణప్రసాద్ రాయనపాడులోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సాంబశివరావును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయనకు సూచించారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ప్రజాశక్తి-నందిగామ : ఎన్టీఆర్ జిల్లాలో చేనేత వృత్తిపై జీవించుచున్న కార్మికులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని నందిగామ నియోజకవర్గ పద్మశాలి చేనేత సేవా సంఘం అధ్యక్షుడు తుమ్మా జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం నందిగామ రైతుపేటలోని కంచర్ల సుబ్బారావు భవనంలో నందిగామ నియోజకవర్గ చేనేత పద్మశాలి సేవా సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో జగన్నాథం మాట్లాడుతూ చేనేత కార్మికులకు సామాజిక పెన్షన్ అమలు చేయాలని, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ కల్పించాలని, చేనేత కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు బి. సుబ్బారావు, ఎం వెంకటేశ్వరావు, మోహన్ రావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, అనీల్,నరసింహారావు, ఏ కష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గ్యార్మి వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానీపురంలోని అల్లుడు పేటలో స్టార్ నవ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్యార్మి వేడుకలలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు విందును వడ్డించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గ్యార్మీ పండుగ మతసామరస్యానికి, ఐక్యతకు ప్రతీక తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజ తదితరులు పాల్గొన్నారు

మానవతామూర్తి విమల

సంస్మరణ సభలో పలువురు వక్తలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సొంత లాభం అంతా మానుకుని, పరుల సేవకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతా మూర్తి విమల అని పలువురు నివాళులర్పించారు. ఇటీవల కన్ను మూసిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సూరపనేని విమల సంస్మరణ సభ ఆదివారం మాకినేని బసవన్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తొలుత విమల చిత్రపటానికి ఆమె సహచరి ఉమాదేవి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ విశ్రాంత అధికారి సూయిజ్ మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలోనూ, ఆ తరువాత చేసిన సేవా కార్యక్రమాలైనా మనసుపెట్టి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణాల నిర్మాణానికి ఆమె పడిన శ్రమను గుర్తు చేసుకున్నారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం నిరంతరం తపిస్తూ, మదర్ థెరిసా వలే తన జీవితాన్నే వారి కోసం అంకితం చేసిన విమల గొప్ప దేశభక్తురాలు అని కొనియాడారు. ఆమె మరణానంతరం కూడా సేవా కార్యక్రమాలు కొనసాగేలాగా ఆమె స్థాపించిన వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఉన్నంత కాలం విమల పేరు చిరస్థాయిగా నిలిచిఉంటుందన్నారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాలినాయుడు మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు పెన్షనర్స్ కార్యాలయాల్లో ట్రస్ట్ నుంచి నిధులు మంజూరు చేసి, ఆవిడ కల్పించిన సౌకర్యాలను గుర్తు చేసుకున్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, విజయవాడలోని విబిఎఫ్ఎస్ గ్రంథాలయ నిర్మాణానికి విమల, ఆమె సోదరుడు ఇచ్చిన భూరి విరాళంతోనే తొలి అడుగులు పడ్డాయన్నారు. ఉద్యోగ జీవితంలోనూ, ఉద్యోగ విరమణానంతరం విమల చేసిన సేవా కార్యక్రమాలను ట్రస్ట్ సభ్యురాలు పద్మ వివరించారు. దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, విజయమేరీ బ్లైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల, వి బి సి ట్రస్ట్ ద్వారా కంప్యూటర్ శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాన్ని అందుకున్న దుర్గారావు, తదితరులు విమల చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ ఆవిడకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విమల ఆశయాలకు అనుగుణంగా వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రతిభావంతులైన ఆరుగురు పేద విద్యార్థులకు, ఒక పేద వితంతువుకు ఒక్కొక్కరికి రూ. 10000 చొప్పున ఆర్థిక సాయం అందించారు.

నేడు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డా అంజిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షురాలు పగిడిపాటి చైతన్య రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తన్నీరు నాగేశ్వరరావు కోరారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఇటీవల అనారోగ్యానికి గురైన రెడ్డిగూడెం మండలం రంగాపురం పంచాయితీ బూరుగ గూడెంకు చెందిన వెలిశెల బేబీ శస్త్ర చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే సిఫారస్సు మేరకు సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన నగదును ఆదివారం బూరుగ గూడెం గ్రామంలో ఆ పార్టీ నేతలు వెలిశెల బేబీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామినేని వెంకటేశ్వరరావు, రామినేని వీరాస్వామి నాయుడు, కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

'శ్రీ రమణీయం'

తమిళ అనువాద గ్రంథం ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు గ్రామంలో గల శ్రీ గురుదమ్ ధర్మక్షేత్రం వ్యవస్థాపకులు శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవులు రచించిన శ్రీ రమణీయం గ్రంధానికి తమిళ వాదంతో ముద్రితమైన పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. గురుధాంలో జరిగిన కార్యక్రమంలో తమిళ అనువాదకులు పిఎస్ గోపాలకృష్ణ, కృష్ణవేణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలకష్ణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక విషయాలను అత్యంత సరళంగా జీవితంలోని ఉదాహరణలతో అన్వయిస్తూ రచించిన శ్రీ రమణీయం అనువదించే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. బహుభాషా కోవిదులైన గోపాలకృష్ణ ప్రతిభను పూర్వ చరిత్రను వెంకటరమణ కొనియాడుతూ సాహిత్యం ద్వారా వారు చేస్తున్న సేవను అభినందించారు. కొలిచెర్ల సాయిబాబా సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎంసీఎల్ కర్మగారానికి చెందిన పలు తమిళ కుటుంబాలు పాల్గొని ఆవిష్కరించిన పుస్తకాలను అందుకున్నారు. హైదరాబాదు, విజయవాడ నుండి పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక సాహిత్య ప్రియులు కార్యక్రమములో పాల్గొన్నారు. శ్రీ గురుదాంలో సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులకు విశేష పూజలు పల్లకి సేవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

కొలికపూడి వ్యాఖ్యలు అర్థరహితం : టిడిపి

ప్రజాశక్తి- నందిగామ : గత కొద్దిరోజులుగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌పై తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు చేస్తున్న అసత్య ఆరోపణలను నందిగామ నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జక్కుల రామారావు, మార్కపూడి ప్రసాద్ తదితరులు ఖండించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆదివారం ఎస్‌సి సెల్ నాయకులు మాట్లాడుతూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వివాదాలకు తెరలేపే ప్రయత్నాలను మానుకోవాలని కోరారు. ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మధ్య సఖ్యతలేదంటూ చేసిన అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అమరావతి ఉద్యమం ద్వారా వెలుగులోకి వచ్చిన కొలికపూడి శ్రీనివాస్‌ను తెలుగుదేశం పార్టీ అధిష్టానం తిరువూరు శాసనసభ్యులుగా అసెంబ్లీలో కూర్చోబెట్టి ఉన్నతంగా గౌరవించడం జరిగిందని, ఈ విషయాన్ని కొలికపూడి ఒకసారి మననం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జక్కుల రామారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పల్లె కంటి రోశయ్య, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు కోట రాజు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బొందల రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల మైనార్టీ సెల్ అధ్యక్షునిగా షేక్ బషీర్



ప్రజాశక్తి-వీరులపాడు: ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం వైఎస్ఆర్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ బషీర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దా పురంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా బషీర్ ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మొండితో అరుణ్ కుమార్ మాట్లాడుతూ మైనార్టీ సమస్యల మీద పరిష్కారమయ్యే వరకు మైనార్టీలకు అండగా ఉండాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ వెస్ట్ బైపాస్ నల్లకుంట దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇమ్మినేని శ్రీనివాసరావు (59) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం వెస్ట్ బైపాస్ నల్లకుంట మార్గంలో బైక్‌పై వెళ్తుండగా అటుగా వెళుతున్న బొలెరో వాహనం వేగంగా వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాసరావు ఒక్కసారిగా బైక్ పైనుంచి గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. భవానీపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్ విజయవాడ రూరల్ అంబాపురానికి చెందిన పి.జోబ్ సుదర్శన్ (28)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నందిగామలో సినీ నటుడు సుమన్ సందడి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో సినీ హీరో సుమన్ ఆదివారం సందడి చేశారు. ఒక ట్రాక్టర్ షోరూమ్‌ను సుమన్ ఆదివారం ప్రారంభించారు. జగ్గయ్యపేట వెళ్తూ మార్గ మధ్యలో నందిగామలో ఆగి ట్రాక్టరు షోరూమ్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సూర్యనారాయణ

ప్రజాశక్తి- నందిగామ : జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నందిగామ చెందిన తోటకూర సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. గత 15 సంవత్సరాలుగా బిసి సంక్షేమ సంఘంలో నిబద్ధతతో సూర్యనారాయణ పని చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా సూర్యనారాయణ నియామకం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఇంచార్జ్, యలగాల నూకానమ్మ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరావు యాదవ్, జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ నందిగామతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా బిసిల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు.



పంచాయతీ కార్యాలయం నిర్మించాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం) : మండలంలోని దావాజీగూడెంలో గల బుద్ధవరం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం పునర్నిర్మాణం కోసం వామపక్ష పార్టీలు ఆదివారం దావాజిగూడెంలో స్థానికులతో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుండి 60 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఉన్న కార్యాలయాన్ని కూల్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా అధికారుల నుండి కానీ ప్రజాప్రతినిధులు నుండి కానీ ఎటువంటి స్పందన లేదని విమర్శించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలం ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు వీరాస్వామి మాట్లాడుతూ, దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన పంచాయతీ కార్యాలయం పునర్నిర్మాణం విషయంలో ప్రభుత్వం స్పందించి తక్షణమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి మరియదాసు, నక్కా రామయ్య, మిరప నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావు, నాగూర్, సిపిఐ నాయకులు తిరువీది సుబ్బారావు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కళాపీఠంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-మొవ్వ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠం, కూచిపూడిలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఇంచార్జి ఉపకులపతి డాక్టర్ శ్రీ. డి. మునిరత్నం నాయుడు ఆదేశాలతో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్, సిద్ధేంద్రయోగి కూచిపూడి కళా పీఠం ప్రధానాచార్యులు డాక్టర్. ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కూచిపూడి కళా పీఠంలో ఎంపిఏ, కూచిపూడి నత్యం , సర్టిఫికెట్ కోర్సు, డిప్లమో కోర్సు ,యక్షగానం, సాత్విక అభినయం కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ ఫీజు 500 రూపాయలతో పూర్తి చేసిన దరఖాస్తులు వచ్చే నెల 15వ తేదీలోగా, అలాగే ఆలస్య రుసుము 200 రూపాయలతో వచ్చే నెల 20 తేదీలోగా కన్వీనర్ సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమహేంద్రవరం-533124కు దరఖాస్తులు పంపాలన్నారు. పూర్తి వివరాలకు www. teluguuniversityap.in ను చూడాలని, మరిన్ని వివరాలకు 9441370591 నెంబరును సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి కళాఉత్సవ్‌కు జిల్లా విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జాతీయ స్థాయి కళా ఉత్సవ్‌కు కృష్ణాజిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు అంగలూరు ఉపాధ్యా య శిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ ఆదివారం విలేకరులకు తెలిపారు. శనివారం విజయవాడలో జరిగిన స్టేట్ లెవల్ పోటీల్లో తలపడిన జిల్లా విద్యార్థులు విజయం సాధించారన్నారు. ఒకే జిల్లా నుండి అత్యధికంగా మూడు విభాగాల్లో, జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. మన ఉమ్మడి జిల్లా నుండి రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌లో పాల్గొని... అత్యుత్తమ ప్రతిభ కనబరిచి... మన జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటారన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు వారి వెన్నంటి ఉండి సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎమ్‌లను ఆయన అభినందించారు.



నేత్రపరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రోటరీ నేత్ర వైద్యశాలలో అధునాతన వైద్య పరికరం ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజ సేవలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రోటరీ సర్వీస్ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ నేత్రవైద్యశాల లో రూ.42 లక్షలు విలువచేసే అదునాతన ఐఓఎల్ స్కానింగ్ పరికరాన్ని మ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 35 సంవత్సరాలకులకు పైగా రోటరీ సర్వీస్ ట్రస్టు నేత్ర వైద్య సేవలతోపాటు, వానప్రస్త వృద్ధాశ్రమం ద్వారా వృద్ధుల కు సేవలదిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మన్ననలు పొందడం అభినందనీయ మని కొనియాడారు. అధునాతన పరికరాలతో తక్కువ ఖర్చుతో నేత్రవైద్యసేవలందిస్తూ రోటరీక్లబ్ ద్వారా సమాజసేవలో ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. సర్వీస్ ట్రస్టు చైర్మన్ జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభించిన పరిక రం ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటి అధునాతన నేత్ర స్కానింగ్ పరికరమని ఈఅవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెక్రటరీ వసంతరావు, పున్నారావు, మేనేజర్ కోటిరెడ్డి, అనీస్, సుబ్రమణ్యం, పులి శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్య శాల చైర్మన్ మండవ జయదేవ్, అనుమోలు ప్రభాకరరావు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 8 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులను తీర్చుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్య నిర్వ హణ అధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే మోహన్‌లు ఏర్పాట్లు పర్య వేక్షించారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి.వి సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రేపు 17వ వార్షికోత్సవం : కొండలమ్మ అమ్మవారి 17వ వార్షికో త్సవం వేడుకలు ఈనెల 28వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ ఈడే మోహన్, ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పములతో పుష్పార్చన, సాయంత్రం పంచ హారతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతున్నట్లు తెలిపారు.

పలు విద్యాలయాల అధిపతులకు జాతీయ ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - గుడివాడ : విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్‌లకు డా॥ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారాలు అందుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతమైన వివిధ రంగాలలో నిష్ణాతులైన (సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్) అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని గుంటూరులో జరిగిన ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారాలను విద్యా వికాస్, విద్యాలయ డైరెక్టర్లు సాంబశివరావు, విజయభాస్కర్‌లకు సంఘ గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అందజేశారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ రాష్ట్ర అధ్యక్షులు డా॥ నాగయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు షేక్ వహీద్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు చెరుకూరి శ్రీహరి, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

శుభోదయ స్కూల్ కరెస్పాండంట్ సజ్జాకు పురస్కారం

ప్రజాశక్తి- నందివాడ : ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం- 2025ను శుభోదయ స్కూల్ కరెస్పాండంట్ సజ్జా అనిల్ కుమార్ కు ప్రదానం చేశారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. అవార్డు పొందిన సందర్భంగా సజ్జాకు శుభోదయ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



శుభోదయ స్కూల్ కరస్పాండెంట్‌కు పురస్కారం అందిస్తున్న దృశ్యం



విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావుకు పురస్కారం అందిస్తున్న దృశ్యం



విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్‌కు పురస్కారం అందిస్తున్న దృశ్యం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కెకెఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల మాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్(ఇండియా) నిర్వహించిన ఒలింపియాడ్ క్వాలిఫైర్ ఇన్ మాథమెటిక్స్ పోటి పరీక్షలలో 17 మంది కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి సెకండ్ లెవల్ ఆర్ఎంఓకు అర్హత సాధించిట్లు ఫాక్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి.కీర్తనరెడ్డి, ఎం.నీరజ్‌కుమార్, డి.వ్యాగ్రీస్‌చౌదరి, వి.హేమసాయి సిద్ధార్థ్, బి.గురుదీపక్‌రెడ్డి, షేక్ సాజీద్‌రిహాన్, ఎ.కార్తిక్‌రెడ్డి, డి.రిషితరెడ్డి, కె.నిహాల్‌రెడ్డి, జి.జయ అభిరామ్, కె.ప్రేమ్‌చంద్, ఎం.వి భవ్యతేజ, పి.మోహిత్ వెంకట సుభాష్, పి.ప్రణీత్‌రెడ్డి, డి.తేజిత్‌నాయుడు, వి.ఆనంద్‌కాశీ వైష్ణవ రెడ్డి, జి.రెడ్డిపునీత్‌యాదవ్‌లు నవంబర్ 16న జరిగే 2వ లెవల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఏడడుగులు పెరిగిన తోటకూర

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రముఖ సామాజిక వేత్త, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు పెరట్లో ఏడు అడుగుల తోటకూర చెట్టు అబ్బుర పరుస్తుంది. ఆయన పెరట్లో పెరుగుతున్న తోటకూర చెట్టును ఏడు అడుగులకు పైగా ఉండటంతో పలువురు తోటకూర చెట్టుని వింతగా చూస్తున్నారు. ఈ సందర్భంగా శ్యామ్ కిషోర్ నాయుడు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుండి చెట్టు ఈ విధంగానే ఉందని, గాలులకు కూడా పడడం లేదని తెలిపారు.





వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ అన్వర్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పామర్రు : ఏ వ్యాధి నైనా సకాలంలో గుర్తించ గలిగితే నివారణ సులభతరం కాగలదని ప్రముఖ వెరికోసిస్ నరాల వ్యాధి నిపుణులు డా.అన్వర్ అన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియం లో హైదరాబాద్ అవిస్ హాస్పిటల్ వారిచే నిర్వహించిన వెరికోసిస్ వ్యాధి నివారణ వైద్య అవగాహనా శిబిరంలో అయన మాట్లాడారు. కాళ్ళల్లో నరాలు ఉబ్బితే తక్షణమే వైద్యుడ్ని సంప్రదించాలని సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవులూరి వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ వైద్య శిబిర సభలో వెరికోసిస్ వ్యాధి అవగాహనా కౌన్సిలర్ జియా,లయన్స్ కార్యవర్గ ప్రతినిధులు డా.బి.వి. అప్పారావు,డా.జి.విక్టర్ పాల్, కూనపరెడ్డి చంద్రశేఖర్,పి.ఎం. ఎస్.ప్రసాద్, బైసాని నాగేశ్వరరావు, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన



ప్రజాశక్తి-వత్సవాయి : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం వత్సవాయిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్.హనుమంతరావు మాట్లాడుతూ.. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో సహా ప్రపంచ దేశాలన్నిటిపైన తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. వ్యవసాయ రంగం దెబ్బతిందని తెలిపారు. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. దాంతో ఉద్యోగులు, కార్మికులు, రైతుల రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు నోరుమెదపడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె వెంకటేశ్వర్లు, గంగుల వెంకటేశ్వర్లు, ఏసుప్రభు, వెంకటరత్నం, గురవయ్య, శ్రీను, కాజా తదితరులు పాల్గొన్నారు..

క్రీడలతో మానసిక వికాసం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: క్రీడలతో క్రమ శిక్షణ పెంపొందుతుందని జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. 65వ జాతీయ రహదారి వద్ద పీవీఆర్ గార్డెన్స్‌లో తపోవన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కరాటే గ్రాండ్ బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్"లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), సినీ నటుడు హీరో సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత తరం పిల్లలు క్రీడల్లో, ముఖ్యంగా కరాటే వంటి ఆత్మరక్షణ కళల్లో ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు కూడా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. తపోవన్ స్కూల్ నిర్వహిస్తున్న ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్తు తరాన్ని శారీరకంగా, మానసికంగా బలపరుస్తాయి" అని పేర్కొన్నారు.



కెసిపి సిమెంట్ ప్రతినిధుల శివాలయం సందర్శన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని పాలేటి ఒడ్డున గల అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం మఠం శివాలయంలో కెసిపి సిమెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి మధుసూదన్ రావు, డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ హెడ్ రాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ నరేంద్ర కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పిన్నం వెంగళరావు, హిందూ చైతన్య వేదిక నగర ఉపాధ్యక్షులు అల్లి రవిచంద్, దేవాలయ ప్రైవేట్ కమిటీ ప్రతినిధులు నీలిశెట్టి వాసు, డోగుపర్తి రాము, పాల్గొన్నారు.

28న 'ట్రంప్ సుంకాలు -భారత్‌పై ప్రభావం'పై సదస్సు



ప్రజాశక్తి - తిరువూరు : యుటిఎఫ్, జెవివి, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలు -భారత్‌పై ప్రభావం అనే అంశంపై ఈ నెల 28న తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న అవగాహనా సదస్సు జయప్రదం చేయాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ పిలుపునిచ్చారు. విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సదస్సుకు జెవివి రాష్ట్ర అధ్యక్షులు, పూర్వ శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎం.హరికష్ణ, ఎం.రాం ప్రదీప్, ఎం.సుధాకర్, ఎం.నాగేంద్ర ప్రసాద్, పి.శోభన్ బాబు, ఎస్‌డి.సుభానీ, బి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ప్రముఖులు సత్యనారాయణ రెడ్డి మృతి



ప్రజాశక్తి-మైలవరం : మైలవరానికి చెందిన ప్రముఖులు గోగులమూడి సత్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో ఆదివారం విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మైలవరంలో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయ్యే వరకు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఆయన అంత్యక్రియలు మైలవరంలో సోమవారం జరగనున్నట్లు కుటుంబ తెలిపారు.

15 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన టెస్ట్ సిరీస్ ప్రో క్యాంపస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రంగా నాగేంద్రబాబు ఆదివారం విలేకర్ల తెలిపారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఈ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ఇంటర్వ్యూల ప్రక్రియలో భాగంగా కంపెనీ ప్రతినిధులు మొదటగా ప్రీ ప్లేస్‌మెంట్ టాక్, అనంతరం టెక్నికల్, హెచ్ఆర్.రౌండ్లు విజయవంతంగా నిర్వహించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 15 మంది విద్యార్థులకు రూ.3 లక్షల నుండి రూ.8 లక్షల వరకు వార్షిక జీతం అందుకోనున్నట్లు తెలిపారు.

రజకులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరువూరు : రజకులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలోని మనూ గార్డెన్స్‌లో ఆదివారం రజక ఆకాంక్ష సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే కొలికపూడి మాట్లాడుతూ రానున్న 6 నెలల్లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తిరువూరులో ఏర్పాటు చేసి విగ్రహ ప్రారంభోత్సవం జరుపుతామని చెప్పారు. వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న రజకులకు కూటమి ప్రభుత్వంలో ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా కషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా రజకులకు రుణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

మృతుని కుటుంబానికి జోగి రమేష్ పరామర్శ



ప్రజాశక్తి-మైలవరం : మండలంలోని మరుసుమల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గొల్లపూడి సుబ్బారావు ఇటీవల మరణించారు. ఆ పార్టీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆదివారం దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విస్సన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామ వైసిపి గ్రామ అధ్యక్షులు షేక్ కాలేషా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ముంగా జయరాజు, కట్టా ప్రసాదు షేక్ ఖాసిం లక్కెనబోయిన గోపి, మేడా రామారావు, కొక్కిరిగడ్డ వెంకటేశ్వరావు, మిర్యాల రమేష్, వడిత్య జిత్య,బాణావతి కోటి, పెరబత్తుల శ్రీరాములు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి విస్సన్నపేట: విస్సన్నపేట స్థానిక బిజెఆర్ నగర్‌లో ఇటీవల ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైన వేల్పుల వెంకటరత్నం కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి బిజెఆర్ నగర్ నాయకులు, కార్యకర్తలు తమ వంతు సాయంగా ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లాగు రాహేలు, మేకల రవి, గొర్రె లాజర్, ఎలీషా, డాక్టర్ దాసు, మేసుపాం, తదితరులు పాల్గొన్నారు.



దాములూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం దాములూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. సొసైటీ చైర్మన్‌గా నల్లూరు అప్పారావు, సభ్యులుగా బొడ్డు చిన్నమ్మాయి, షేక్ ముస్తఫా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాదు త్రిసభ్య కమిటీని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలందించాలని వారికి సూచించారు. రాజకీయాలకు అతీతంగా సొసైటీ సభ్యులకు రుణాలు, పథకాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటేపల్లి రవికుమార్, రామలక్ష్మి దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్యాన్నదానం పథకానికి రూ.10,116 విరాళంగా అందజేశారు. విరాళానికి సంబంధించిన నగదును ఆదివారం ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్లకు అందజేశారు వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందజేత

ప్రజాశక్తి-మైలవరం : మైలవరంలోని జండా చెట్టు వద్ద ముస్లిం సోదరులు నిర్వహిస్తున్న గార్మి పండుగకు ఆదివారం తెలుగు యువత అధ్యక్షులు లంక లీతీష్ పదివేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా లితీష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని, అన్ని కులాల వారు అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాయత్రీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : స్థానిక రథం సెంటర్లో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం (పాత శివాలయం) కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు ఆదివారం గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాస నక్త దీక్ష మహోత్సవాలలో భాగంగా అమ్మవారు నిత్యం విశేష అలంకారాలలో భక్తులను దర్శనమిస్తారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు మురళీధరన్ నంబూద్రి, రాచకొండ నాగరాజు శర్మ, కొత్తపల్లి సాయి కష్ణ శర్మ, నాదెళ్ల లక్ష్మీ రాఘవేంద్ర శర్మ తదితరులు నిర్వహించారు

కనియమ్మకు నివాళి

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేటలో స్థానిక బీసీ కాలనిలో అనారోగ్య రీత్యా టిడిపి కార్యకర్త మాయదేవర జగదీష్ మాతృమూర్తి మాయదేవర కనియమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆమె దశదిన కార్యక్రమానికి స్థానిక టిడిపి నేతలు హాజరై నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విసన్నపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు, తిరువూరు ఏఎంసి డైరెక్టర్ పల్లెపాం రాంబాబు, టిడిపి నాయకులు అనుమోలు శివ బాజీ, తదితరలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు.

ఎన్నికల కమిషన్ స్పందించాలి : బడే గౌతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో గత రెండు రోజుల నుండి జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించాలని నియోజకవర్గం వైసీపీ యువనేత బడే గౌతం కోరారు. ఆదివారం ఆయన ఆమనగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎలాగైనా అధికారాన్ని చేజ్జికించుకోవాలని కోట్లాది రూపాయలు వెదజల్లి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని అర్థమవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్లో ఎమ్మెల్యే అభ్యర్థి రూ 40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ 95 లక్షలు మించి ఖర్చు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ తిరువూరు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు మీడియా ముందుకు వచ్చి బహిరంగంగా గత ఎన్నికలలో కోట్లాది రూపాయలు ఏ విధంగా చేతులు మారాయో స్పష్టం చేశారని తెలిపారు. కానీ ఎల్లో మీడియా మాత్రం ఎమ్మెల్యే ఎంపీల మధ్య సైకృత కోసం గంటల తరబడి చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తుందే తప్ప, నిబంధనలు ఉల్లంఘించి కోట్లాది రూపాయలు చేతులు మారటాన్ని బహిరంగంగా ఒప్పుకున్నందున ఎందుకు అనర్హులుగా ప్రకటించ కూడదంటూ ప్రశ్నించకపోవటాన్ని గౌతమ్ తీవ్రంగా ఖండించారు. భారతదేశంలో ఏదైనా రాజకీయ పార్టీ ఈ విధంగా ప్రవర్తించి ఉంటే 24 గంటలు బ్రేకింగ్ న్యూస్లతో ఊదరగొట్టే ఈ ఎల్లో మీడియా జరిగిన దానిపై తిరువూరు ఎమ్మెల్యేని, విజయవాడ ఎంపీని వెనకేసుకు రావడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. జరుగుతున్న పరిణామాలను సుమోటోగా తీసుకొని జాతీయ ఎలక్షన్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషన్ తిరువూరు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిలను అనర్హులుగా ప్రకటించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గుడివాడలో...

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : చల్లపల్లి మండలం వెలుగోలు గ్రామ జనసేన అధ్యక్షుడు కోనేరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘంటసాల మండలం గోగినేని వారి పాలెం గ్రామ జనసైనికుడు కుంపటి నాగ శ్రీను తన మిత్రులు, గ్రామస్తులు 12 మందిని జనసేన పార్టీలో చేర్చారు. ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయంలో నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు వారికి జనసేన కండువాలతో స్వాగతం పలికారు. **ప్రజాశక్తి - గుడివాడ :** జనసేనలోకి చేరిన వివిధ పార్టీలకు చెందిన నాయకులకు జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆదివారం స్థానిక భాస్కర్ థియేటర్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో బూరగడ్డ శ్రీకాంత్ 30 మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు సాయన రాజేష్, పడాల పూర్ణ, ఇమ్మిడిశెట్టి భాను, తదితరులు పాల్గొన్నారు.

'మొంథా'పై అప్రమత్తంగా ఉండాలి

- కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా): మొంథా తుపాన్ కారణంగా రానున్న మూడు రోజులు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్రాధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ మోంథా తుఫాను సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తుఫాను హెచ్చరికలపై దండోరా వేయించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలం దరికీ తెలియజే యాలన్నారు. సహాయక శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బందరు కలెక్టర్ కార్యాలయంలో 08672 252572, మచిలీపట్నం ఆర్డిఓ కార్యాలయంలో 08672 252486, గుడివాడ ఆర్టీవో కార్యాలయంలో 08674 243693, ఉయ్యూరు ఆర్డిఓ కార్యాలయంలో 08676 232589 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ విభాగాలు నిరంతరం పని చేస్తాయని కలెక్టర్ తెలిపారు. అలాగే అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ విభాగాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



మంగినపూడి బీచ్‌ను పరిశీలిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ

మంగినపూడి బీచ్ పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కలెక్టర్ మంగినపూడి బీచ్‌ను సందర్శించి అక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలించారు. తీర ప్రాంతంలోని మత్స్యకారులు వేట కోసం సముద్రంలోకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. బీచ్ ప్రాంతంలో పర్యవేక్షణలో ఉన్న భద్రత పోలీస్ సిబ్బందితో మాట్లాడి సందర్శకులు ఎవరినీ కూడా లోపలకు అనుమతించవద్దని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, మత్స్య శాఖ జిల్లా అధికారి అయ్యా నాగరాజా తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: అధికారులు ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్ణా నదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ.. అటువైపు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది 24/7 పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని.. ఏదైనా అత్యవర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454)కు నివేదించాలని సూచించారు. విజయవాడ ఆర్డీవో కార్యాలయం (0866 2574454), నందిగామ ఆర్డీవో కార్యాలయం (78930 53534), తిరువూరు ఆర్డీవో కార్యాలయం (83098 36215)లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ: మొంథా తుపాను నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించాల్సిన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 వ తేదీ నుండి 29 తేదీ వరకు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో జిల్లా అధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని, దీని వల్ల పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. అలాగే విఎంసి, సిపి కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాల్లో పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా గంజాయి మరియు ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



కోటి సంతకాలతో అసత్య ప్రచారం : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైద్య కళాశాలల పిపిపి విధానానికి వ్యతిరేకంగా వైసిపి వారు చేపట్టిన కోటి సంతకాల అసత్య ప్రచారం, మోసపూరిత మాటలు ప్రజలు నమ్మవద్దని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం అవనిగడ్డ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్లే హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి గాని, వైసీపీ నాయకులకు ఎవరికి లేదని, వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండే రాఘవ, పర్చూ రీ దుర్గాప్రసాద్, మసాలా రాజమోహన్రావు, మేడికొండ విజయ్, మండలి రామ్మోహన్రావు పాల్గొన్నారు.

బాలాజీకి అభినందనలు

ప్రజాశక్తి-కంకిపాడు : రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన షేక్ బాలాజీని పలువురు టిడిపి నాయకులు అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగీపు రంగారావు, కంకిపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరరావు, ఈడుపుగల్లు గ్రామ పార్టీ అధ్యక్షులు షకర్, బూత్ కన్వీనర్స్ వణుకూరు విక్రమ్ తదితరులు ఉన్నారు.

నీట మునిగిన పంటలు పరిశీలన

ప్రజాశక్తి-కోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా తీవ్రమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు తీర ప్రాంత గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఆదివారం కోడూరు మండలంలోని దిగువ ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలను పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దిగువ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక రైతులు వెంకట్రామ్ దృష్టికి తీసుకువచ్చారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ కష్ణా జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు పట్టణాధ్యక్షుడు కోట రాంబాబు, నీటి సంఘాల అధ్యక్షులు గంజాల సుందరరావు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బుద్ధప్రసాదు

విద్యారంగ అభివృద్ధికి ఎంవి కృష్ణారావు కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో విద్యారంగ వ్యాప్తికి మండల వెంకటకృష్ణారావు విశేషమైన కృషి చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అవనిగడ్డలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం ప్రజలను చైతన్యపరిచి మండల వెంకటకష్ణారావు విరాళాలు సేకరించి 1969లో అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలను, అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పివి నరసింహారావుతో ప్రారంభింప చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట కష్ణారావు చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2025 మెగా డీఎస్సీలో విజేతలైన కళాశాల పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి ఇవాళ అధిపతి అంకారావు, అధ్యాపకులు డాక్టర్ ఏ వీర కుమారి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయంలో రద్దీ



ప్రజాశక్తి-మోపిదేవి : రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన మోపిదేవి లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో పోటెత్తింది. నాగుల చవితి పర్వదినం తరువాతి రోజు వచ్చే నాగపంచమికి విశిష్ట స్థానం ఉంది. దీంతో ఆదివారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ లైన్‌లలో వేచియుండి, ఆలయ ఆవరణలోని నాగ పుట్టలో పాలు పోసి, స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో దేవస్థానంతో పాటు మోపిదేవి ప్రధాన రహదారులు భక్తులతో కిటకిట లాడాయి. డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో వేచియున్న భక్తులకు మంచినీటి బాటిల్స్, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ, చిన్న పిల్లలకు పాలను పంపిణీ చేశారు.

జలధీశ్వరాలయం సందర్శన



ప్రజాశక్తి-ఘంటసాల : భద్రాచల రామాలయం నిర్మించిన భక్త రామదాసు (కంచర్ల గోపన్న) 11వ తరం మునిమనవడు కంచర్ల వెంకటరమణ ఆదివారం ఘంటసాల శ్రీ బాల పార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి వారిని దర్శించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దాలిపర్తి చలపతిరావు పూజాదికాలు నిర్వహించి దేవాలయ సత్కారం చేసారు. ఈ సందర్భములో కంచర్ల వెంకట రమణ మాట్లాడుతూ ఇంతటి ప్రాచీన మహిమాన్విత దేవాలయం గురించి జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి రామకష్ణ తెలియచేయగా దర్శించ గలిగినానిని, ఘంటసాల గ్రామం తో వారికి వున్న బంధుత్వం తెలియచేసారు. అర్చకులు దాలిపర్తి చలపతిరావు , ఘంటసాల కరణం తదితరులు బంధువులే అని చెప్పారు .

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజయవాడ : ఠాగూర్ గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచారకుల వారి ఆదేశాల ప్రకారం ప్రతి ఆదివారం జరుగు చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ స్కూళ్ల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ క్విజ్ వల్ల పిల్లల్లో భాషాభివృద్ధి, ఆలోచనా శక్తి పెరుగుతుందని, సొంత జ్ఞానాన్ని ఉపయోగించి వివిధ విషయాల గురించి తెలుసుకుంటారని తెలిపారు. దేవ్ మాస్టారు, దుర్గ భవాని క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలాజీ, భార్గవ్ వర్మ, వైష్ణవి విజేతలుగా నిలిచారు. జ్ఞానేశ్వరి, టి.రాజేశ్వరి, రామ్ సాయి రన్నర్లుగా నిలిచారు. గ్రంథాలయాధికారి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న 'మధువని' సుస్వరాలు



విజయవాడ : "మధువని" సుస్వరాల పల్లకి (20వ)- గుంటూరు వారి 'మధురమే సుధా గానం" సినీ సంగీత విభావరి గాంధీనగర్ కౌతా పూర్ణానంద కళావేదికపై హాయిగా సాగింది. తెలుగు సినిమా 94 సంవత్సరాల వేడుకల్లో భాగంగా రోజుకోకళాసంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుండి జరుగుతున్న తెలుగు సినీ కళావైభవం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి జరిగిన సినీ విభావరి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. డ్రీమ్ ఆడియో చావా నరసింహారావు సౌజన్యంతో జరిగిన మధుర సినీ గీతాలాలాపన కార్యక్రమంలో ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు వి.మధుబాబు (టీమ్ లీడర్), శివ ప్రసాదరావు, ఎస్.సత్యనారాయణ, కె.వై.కపావరం, ఎ.రాఘవ, కె.అన్నపూర్ణ, ఎ.సుభాషిణి తదితరులు పాడిన పాటలకు పి. మల్లేశ్వరి ట్రాక్ పై సహకారం ఎంతగానో నప్పింది. చిట్టిబాబు, పరుచూరు విజయలక్ష్మి తదితరులు సమన్వయం చేశారు. మధిరకు చెందిన రోజా ప్రసన్నత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మధుబాబును స్థానిక కళా సంస్థల పెద్దలు సత్కరించారు.

కనులవిందుగా నృత్య ప్రదర్శనలు



విజయవాడ : "దృశ్య వేదిక" (సాంస్కృతిక సంస్థ) నెలవారీ కార్యక్రమంలో భాగంగా "శాస్త్రీయం - జ్ఞానపదం" అన్న మకుటంతో ఆదివారం రాత్రి స్థానిక వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో పలు నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా- ప్రముఖ మృదంగ కళాకారుడు, సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు, సీనియర్ జర్నలిస్టు శీరం సుబ్రహ్మణ్యం స్మారక పురస్కారాన్ని ప్రముఖ నాట్యాచార్యులు పి.హేమంత్ కుమార్‌కు ప్రదానం చేశారు. సన్మాన సభకు "దృశ్య వేదిక" ఉపాధ్యక్షుడు దొంతాల ప్రకాష్ అధ్యక్షత వహించారు. కళాపోషకులు అంబటి మధుమోహన్ కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంస్థ ప్రతినిధులు ఎన్ఎస్ఆర్ మూర్తి, రఘు తదితరులు వేదికను అలంకరించారు. కార్యక్రమాన్ని హెచ్‌విఆర్ఎస్ ప్రసాద్ (సంస్థ అధ్యక్షుడు), పి.భాస్కర్ శర్మ, ఈ భాగ్యరాజ్, రమేష్ బాబు, బొర్రా నరేన్, బోడి ఆంజనేయరాజు, ఈ.విజయసాగర్ తదితరులు నిర్వహించారు. ప్రముఖ నాట్యకారుడు శ్రీనటరాజ నృత్యాలయం నాట్యాచార్యులు రాయన శ్రీనివాసరావు శిష్యులు మేఘన సంధ్య, టి.లక్ష్మీచైత్ర, హర్షప్రియ, జి.శాంతి త్రివేణి, ఎం.జయశ్రీ హర్ష, వి.హాశ్విక, పి.వి.ఎస్.డి.షణ్ముఖశ్రీ తదితరులు పలు ఆంధ్ర నాట్య రీతులు అద్భుతంగా నర్తించారు. హంసధ్వని కూచిపూడి నృత్యాలయ నాట్యాచార్యులు సిహెచ్.అజయ్ కుమార్ శిష్యులు సుమారు 50 మంది (ఏడు గ్రూపులు) జానపద నృత్యాలతో హోరెత్తించారు.

డిమాండ్ల సాధనలో వెనక్కి తగ్గం

- ఎపి ఎన్‌జిఒ నేతలు ఎ.విద్యాసాగర్, డివి రమణ



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగుల సమస్యలపై ఇటీవల ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అడుగు ముందుకు పడిందని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు గత ఐదు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు లభించే దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు వేల కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను గత ప్రభుత్వం కోత విధించిదని, కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. తమ ఆకాంక్షలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశాభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులందరూ భావిస్తున్నారన్నారు. ఇటీవల జారీ చేసిన డీఏ ఉత్తర్వుల్లో నెలకొన్న గందరగోళం సరిచేయాలని ఏపి ఎన్‌జిఓ సంఘం ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లిన 24 గంటలలో సవరించిన జీవోను జారీచేశారన్నారు. ప్రతి ఉద్యోగికి చట్టపరంగా లభించాల్సిన హక్కుల కోసం ఉద్యోగుల గొంతుకగా ఎపి ఎన్‌జిఒ పనిచేస్తుందన్నారు. గత ఆరు సంవత్సరాలుగా పదోన్నతులు లేకుండా ఆగిపోయిన ఆర్టీసీ విభాగంలో ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సంతోషదాయకమని తెలిపారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రి మెంట్లు అమలు చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో అపరిష్కృత సమస్యలకు పరిష్కారం సాధించే దిశగా ఏపీఎన్జీజీవో కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకులు కె.జగదీశ్వర రావు, జానకి, రాజ్యలక్ష్మి, కాపిటల్ సిటీ కార్యదర్శి సరస్వతి, జిల్లా అధ్యక్షుడు డిఎస్ఎన్ రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మొంథా తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి- నందిగామ : మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. "ప్రభుత్వం ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి ప్రజలను ముందుగానే అక్కడకు సురక్షితంగా తరలించాలని. ప్రజలు కూడా అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని, తుపాన్ సమయంలో పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించి కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుపాన్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో విద్యుత్, నీటి, ఆహార సరఫరా వంటి అత్యవసర సేవల్లో అంతరాయం రాకుండా అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

సూర్యా స్కూల్‌కు ఎడ్యూకాన్ 2025 అవార్డు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడలోని సూర్య విద్యానికేతన్ స్కూల్‌కు రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మకమైన ఎడ్యూకాన్ 2025 అవార్డు వరించిందని డైరెక్టర్ అబ్రార్ అలీ తెలిపారు. మల్లా బ్యూరో అఫ్ చైల్డ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం హొటల్ ఫెయిర్ఫీల్డ్ మ్యారియట్‌లో ఎడ్యూకాన్ 2025 ఎంపికను ఘనంగా నిర్వహించారని తెలిపారు. విద్యా రంగంలో విశేష కృషి చేసి విద్యార్థుల భవిష్యత్తును రూపు దిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న "సూర్య విద్యా నికేతన్" ఈ కార్యక్రమంలో అత్యుత్తమ స్థానంలో నిలవటంతో పార్లమెంట్ సభ్యులు, గీతం యూనివర్సిటీ అధినేత భారత్ చేతుల మీదగా ఎడ్యూకాన్ 2025 అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. విద్యారంగంలో విశిష్టమైన సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించేందుకు స్కూల్ అఫ్ వండర్ కిడ్స్, నిసా, అపుస్మా (ఏపి ప్రైవేట్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) కలిసి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నీట్ 2025లో ఉత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రంలోనే ప్రతిష్టత్మకమైన మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులను ఎస్.ఆర్. కళాశాల ప్రతినిధులు ఆదివారం నగరంలోని కళాశాల క్యాంపస్‌లో ఘనంగా సన్మానించారు. 2023-2025 విద్యా సంవత్సరం ఎస్.ఆర్.కళాశాలలో రెగ్యులర్ ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 46 మంది ఎంబిబిఎస్ సెట్లు సాధించారు. వీరిని ప్రత్యేకంగా ఎస్.ఆర్.విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదా రెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, ఎ.సంతోష్ రెడ్డి, సిఇవో సురేంద్రరెడ్డి, నీట్ కోఆర్డినేటర్ సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, డిజిఎం జెవి.రమణ, కోర్ డీన్ అరవింద్, అన్ని జిల్లాల జోనల్ ఇంచార్జిలు, డీన్స్, ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీట్‌లో ఉన్నతమైన కోచింగ్‌తో పాటు సీనియర్ అధ్యాపకుల భోధన, వారంతాపు పరీక్షల వల్ల ఈ ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎస్ఆర్ విద్యా సంస్థలు అతి తక్కువ ఫీజులతో అత్యున్నత కోచింగ్ ఇస్తూ మధ్యతరగతి వారికీ కూడా ఉన్నత చదువులకు వెళ్లే అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

సాహితీవేత్త కొల్లూరికి నివాళి



విజయవాడ : ఇటీవల మరణించిన ప్రముఖ సాహితీవేత్త, "ఎక్స్ రే" సాహిత్య సంస్థ అధ్యక్షుడు కొల్లూరికి అరండల్ పేట కార్యాలయంలో ఆదివారం పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్వీ సుబ్బారెడ్డి (వాకర్స్ గవర్నర్, నెల్లూరు), డాక్టర్ ఎంవీ రావు, బి.ఆంజనేయరాజు, సీహెచ్ వి సుబ్బయ్య, బి. వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.

'ఫిలిప్ మోరిస్' బిజినెస్ విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :: ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ అయిన ఐపిఎం ఇండియా, బిజినెస్ విస్తరణకు ప్రణాళిక రూపొందించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నీల్ కమల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలిప్ సంస్థ పలు కెరీర్ కార్యక్రమాలను నిర్వహించిందని అన్నారు. . కెరీర్ యాజమాన్యం వద్ధి నమూనా, స్వీయ ఆధారిత కెరీర్ ప్రణాళికను ప్రారంభించే ప్రతిబింబించే ఫ్రేమ్‌వర్క్,ప్రత్యేకంగా రూపొందించారని అన్నారు . డిజిటల్ కోచింగ్ ప్లాట్‌ఫామ్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్యోగులు తమ కెరీర్‌లను బాధ్యత వహించడానికి సాధికారత ఇస్తూనే, అదే సమయంలో వ్యాపార ప్రాధాన్యతలతో వ్యక్తిగత వద్ధిని సమలేఖనం చేస్తుందనీ అన్నారు.

కాంట్రాక్టర్లకు రుణం మంజూరు

ప్రజాశక్తి-విజయవాడ

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పలువురు కాంట్రాక్టర్లకు మంజూరు అయిన బ్యాంక్ లోను ద్వారా పెండింగ్ బిల్లులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. సుమారు 200 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. వీరిలో 150 మంది కాంట్రాక్టర్లు అడపాదడపా సివిల్ వర్క్స్ చేయిస్తుంటారు. అయితే 50 మందికి పైగా విఎంసి పరిధిలో రెగ్యులర్‌గా వర్క్స్ చేస్తుంటారు. అయితే కాంట్రాక్టర్లందరికీ సుమారు రూ. 60 కోట్ల వరకు విఎంసి బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. రెగ్యులర్‌గా బిల్లుల చెల్లింపుల్లో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో సివిల్ వర్క్స్ కూడా అదే స్థాయిలో ఆగిపోతున్నాయి. పనులు చేయించాలన్నాఎక్కువ మంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు చేయించాల్సి వస్తుండటం, వివిధ రూపాల్లో విఎంసి ఖజానాకు రావాల్సిన రాబడి ఆశించిన స్థాయిలో జమలు కాకపోతుండటంతో విఎంసి ఉన్నతాధికారులు సదరు కాంట్రాక్టర్లతో చర్చించి, విఎంసి షఉ్యరిటీతో బ్యాంక్‌ల వద్దకు లోను రూపంలో రుణ సదుపాయం కోసం వెళ్లడం, ఆర్‌బిఐ నిబంధనలకు లోబడి విఎంసిలో ఏడాదికి రూ.250 కోట్లకు పైగా టర్నోవర్ నడుస్తుండటంతో ఎస్‌బిఐ, ఇతర పలు బ్యాంక్‌లు లోను సదుపాయానికి అంగీకారం తెలిపారు. 6.56 శాతం వడ్డీతో బ్యాంక్ లోను రూ. 30 కోట్లకు గాను మొదటి దఫాగా రూ.8.70 కోట్లు ఎస్‌బిఐ లోను మంజూరు చేసినట్లు తెలిసింది. ఇంకా రూ. 22.30 కోట్లు లోను రూపంలో బ్యాంక్‌లు మంజూరు చేయాల్సి ఉంది. ఈ అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి చివరి వరకుచేసిన వర్క్సకు సంబంధించిన బిల్లులకు బ్యాంక్ లిస్తున్న లోను డబ్బులు జమ అవుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని విఎంసి అధికారలు, కాంట్రాక్టర్లు వెల్లడిస్తున్నారు. తక్షణం చేయాల్సిన పనులు ఆగకుండా, నిర్దేశించిన కాలం లోపులో కాంట్రాక్టర్లు చేసిన వర్క్సకు సంబంధించిన బిల్లులకు...బ్యాంక్‌ల ద్వారా మంజూరు అవుతున్న లోను డబ్బు జమ అవుతాయని, ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లకు సుమారు రూ. 60 లక్షలకు పైగా వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయినట్లు కాంట్రాక్టర్లు వివరిస్తున్నారు.